క్లుప్తంగా

నేటి నుంచి 'ఉపాధి' పనులపై ఆడిట్ సర్వే

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం నుంచి ఉపాధి హామీ సోషల్ ఆడిట్ సర్వే నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఈజీసీ జేఈ జయచంద్ర కుమార్ శనివారం తెలిపారు. మొదటి విడతగా నెమలిపురి, అనుపాలెం, అంచులవారిపాలెం, రాజుపాలెం, మొక్కపాడు గ్రామాల్లో ఆడిట్ బృందం సర్వే చేస్తుందని పేర్కొన్నారు. ఈ ఆడిట్‌లో పింఛన్లు, ఉద్యాన శాఖ, ప్రభుత్వ భవనాలు, నాడు–నేడు పనులు, కూలీల రిజిష్టర్‌పై సర్వే చేస్తారని చెప్పారు. ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో ఐదుగురు డీఆర్పీలు, వీఎస్ఏలు ప్రతి రికార్డును పరిశీలిస్తారని తెలిపారు. 2022–23 ఏడాదికి సంబంధించి 786 పనులకు గాను రూ.6.87కోట్ల బిల్లులను ఆడిట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్పీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

12 నుంచి వైద్య శిబిరాలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పట్టణంలో ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం తెలిపారు. 12, 16న ప్రగతి డిగ్రీ కళాశాలలో, 17న సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 18న నాగార్జున నగర్ లోని తెలగ హాస్టల్ వద్ద, 21న గుంటూరు రోడ్డులోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, 26న వెంగళరెడ్డి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. స్థానిక యూపీహెచ్‌సీ వైద్యులతో పాటు నిష్ణాతులైన వైద్యులు హాజరవుతారని, ఎలాంటి రుగ్మతలు ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు, సలహాలు, సూచనలు పొందాలన్నారు.

షాదీఖానా నిర్మాణ పనులు పరిశీలన



అమరావతి: నెమలికల్లు ముస్లిం కమ్యూనిటీ హాల్(షాదీ ఖానా) నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. రూ.25లక్షల నిధులతో నిర్మాణ పనులు చేపట్టినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మరో రెండు నెలల్లో ప్రారంభోత్సవానికి భవనాన్ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, సర్పంచ్ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అళ్ళ శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం గళం విప్పండి

ముప్పాళ్ల(సత్తెనపల్లి): దళితులు, గిరిజనులు సామాజిక న్యాయానికి గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయలపాటి శివనాగరాణి పేర్కొన్నారు. శనివారం ముప్పాళ్ల జగన్నాథస్వామి దేవస్థానంలో జరిగిన పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపైన అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయన్నారు. వివక్షతలకు గురువుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఆందోళన ప్రారంభించాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినికి 'స్నేహ హస్తాలు' ఆర్థిక సాయం



అచ్చంపేట: మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన సలికేటి అంజలి బాపట్ల అగ్రి కల్చరల్ కాలేజ్‌లో ఎంఎస్సీలో సీటు సాధించింది. స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు ఆమెకు మొదటి సెమిస్టర్ ఫీజు రూ.25,000లు సాయమిచ్చారు. నగదు చెక్కును శనివారం సంస్థ గౌరవ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన అంజలి అగ్రికల్చరల్ బీఎస్సీ చదవేటప్పుడు సంస్థ ద్వారా లక్ష రూపాయలు సాయం చేసినట్లు తెలిపారు.

శిశు మందిరానికి డిజిటల్ సౌండ్ సిస్టం విరాళం

అమరావతి: స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు డిజిటల్ పాఠ్యాంశాల బోధనకు స్థానిక బంగారం వ్యాపారి పారేపల్లి రాధాకృష్ణ, పుష్పలత దంపతులు డిజిటల్ సౌండ్ సిస్టంను విరాళంగా శనివారం అందించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావుకు డిజిటల్ సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే జగనన్న సురక్ష లక్ష్యం



19వ వార్డులో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాసరావు



కంటెపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

సత్తెనపల్లి: పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. కంటెపూడి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. వైద్యులు డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎం.అనూష, డాక్టర్ ఎస్కే ఆరీఫ్, డాక్టర్ రామచంద్రమూర్తి 413 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అలాగే 702 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం 9 మందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 120 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 104 మందికి కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. 12 మందిని కళ్లకు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దయాసాగర్, వైద్య సిబ్బంది, కట్టావారిపాలెం సర్పంచ్ మద మంచి పార్వతీ కుమారి, కంటెపూడి సర్పంచ్ ఇపరాపట్నం యమునా బొబ్బిలి పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే..

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ప్రాథమిక వైద్య పరీక్షలు పట్టణంలోని 10, 19, 20 వార్డుల్లో శనివారం ముమ్మరంగా సాగాయి. 10వ వార్డులో కౌన్సిలర్ పెద్దింటి గోవిందమ్మ ఇంటింటి సర్వేను పరిశీలించారు. నాగార్జున నగర్‌లో మెడికల్ చెకప్ నిర్వ హించారు. బీపీ, షుగర్, హెచ్‌బీ, కంటి, మలేరియా పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రోశయ్య మాట్లాడుతూ ఈ నెల 18న నాగార్జున్‌నగర్ లోని రంగాబొమ్మ తెలుగు హాస్టల్ దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం డి.శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ రత్నకుమారి, వేద కళాశాల నర్సింగ్ విద్యార్థినులు ఉన్నారు. 19వ వార్డు కొత్తపేటలో కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, సచివాలయ అడ్మిన్ శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ జహీర్, వెల్ఫేర్ బాషా, శానిటేషన్ సెక్రెటరీ సుధారాణి, మహిళా పోలీస్ గీతవాణి, ఆశ వర్కర్ శైలజ పాల్గొన్నారు. 20వ వార్డులో కౌన్సిలర్ కుకుట్ల లక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, వైద్య సిబ్బంది సూచనలు చేశారు.

ప్రతీ కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండాలి

రాజుపాలెం: దేవరంపాడులోని ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నిపుణులైన డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రవితేజ, డాక్టర్ కిషోర్ 329 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అందులో 289 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ, దేవరంపాడు దేవస్థానం చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, ఎంపీటీసీ నకరికంటి మస్తాన్, సూపర్ వైజర్ ఉషారాణి, మాజీ సర్పంచ్ శ్యామకూరి శ్రీను పాల్గొన్నారు.

644 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం(నకరికల్లు): మండలంలోని గుండ్లపల్లి గ్రామ సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్‌లు ప్రవల్లిక, అభినవ్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీనునాయక్, పూజశ్రీ 644 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 203 మందికి బీపీ, షుగర్ టెస్ట్‌లు చేశారు. మందులు పంపిణీ చేశారు. 32 మంది గర్భిణులకు, బాలింతలకు గైనకాలజిస్టు డాక్టర్ ప్రవల్లిక వైద్య పరీక్షలు చేపట్టారు. 170 మందికి ఆప్తమాలజిస్ట్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేదారపు అనురాధ, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, తహసీల్దారు నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ గిరిధర్ పాల్గొన్నారు.



20వ వార్డులో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ లక్ష్మి

ప్రజలందరికీ ఉచిత వైద్యం సీఎం జగనన్న లక్ష్యం

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం సచివాలయం పరిధిలోని ప్రజలకు స్థానిక ఎంపీపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వమించారు. క్రోసూరు సర్పంచ్ మల్లా చంద మామ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగపూర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వెలది అప్పారావు శిబిరాన్ని పర్యవేక్షించారు. 350 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ యశ్వంతి, పల్మనాలజిస్టు డాక్టర్ డింపుల్ , పీహెచ్‌సీ డీడీవో డాక్టర్ ఎస్.రమాదేవీ, డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహ్మద్ సాద్, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్‌లు, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్ వైద్య సేవలు అందించారు. ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, క్రోసూరు గ్రామ ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, పంచాయతీ సెక్రటరీ పంతులు నాయక్, మాజీ ఎంపీటీసీ కె.రామాంజనేయులు, వెంకయ్య పాల్గొన్నారు.

308 మందికి వైద్య సేవలు

బెల్లంకొండ: మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో శనివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 308 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు కోటేశ్వరరావు తెలిపారు. జనరల్ విభాగంలో 60 మందికి, కంటి వైద్య సేవలు 48, గర్భిణులు 21, ప్రసూతి వైద్య సేవలు 15, జనరల్ ఫిజీషియన్ సేవలు 186 మందికి అందించామన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఎంపీడీవో బి.వెంకటరెడ్డి, జనరల్ సర్జన్ వైద్యులు రాజేష్, స్త్రీ ప్రసూతి వైద్యులు అనీలారెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాయికృష్ణ, వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ బాణావతు నరసింహానాయక్, ఎంపీటీసీ భుక్యా నరసింహానాయక్, సూపర్ వైజర్లు బాషా, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నార్నెపాడులో..

నార్నెపాడు(ముప్పాళ్ల): నార్నెపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం జరిగింది. వైద్యులు పి.రమాదేవి, ఫరూక్ ఫర్వేజ్, మృదుల తేజశ్విని, ప్రసన్నకుమార్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు.



10వ వార్డులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



దేవరంపాడులో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



గుండ్లపల్లిలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



ఎర్రబాలెంలో విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్



నార్నెపాడులో దివ్యాంగుడికి సూచనలిస్తున్న వైద్యుడు

రైళ్లలో చైన్ లాగటం, రాళ్లు వేయటం చేయొద్దు

హెచ్చరించిన ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

నరసరావుపేట: రైళ్లలో చిన్న చిన్న కారణాలకు చైన్ లాగుటం, వేగంగా వెళ్లే రైళ్లపై రాళ్లువేయటం లాంటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జి.తిరుపతిరావు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో ఆర్‌పీఎఫ్ సర్కిల్ పరిధిలోని నుదురుపాడు నుంచి కంభం రైల్వేస్టేషన్ల వరకు చైన్ లాగడం, రాళ్లు రువ్వడం వంటి పనులు చేయటం ద్వారా జరిగే పరిణామాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ చర్యల వల్ల రైల్వేకు, ప్రయాణీకులకు సమయం వృథాతో పాటు, రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. రాళ్ల దాడి వల్ల ప్రయాణికులు గాయాల పాలవుతారన్నారు. రైల్వే ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని వెల్లడించారు. ఈ మధ్యకాలంలో ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ప్రయాణికులు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు అలారం చెయిన్ సపోర్ట్ తీసుకోవటం, దిగాల్సిన గమ్యస్థానంలో నిద్రపోయి దిగకుండా హడావుడిగా చైన్‌లాగి ట్రైన్ ఆపే ప్రయత్నం చేయటం లాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. దీనికి సంబంధించి తాము రైల్వేచట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పర్చాల్సివస్తుందన్నారు. గత తొమ్మిది నెలల వ్యవధిలో చైను లాగిన సంఘటనలపై 35 కేసులు నమోదు చేశామన్నారు. ట్రైన్, పరిసర ప్రాంతాల్లో సిగరెట్ లాంటి పొగ తాగిన వారిపై ఐపీసీ 468 కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల రైలు పట్టాలపై పశువులు సంచరించటంపై పది కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమస్యలపై ప్రజలు, ప్రయాణీకులు అప్రమత్తతో వ్యవహరించాలని కోరారు. ఏఎస్ఐ సుభాని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



స్థానిక ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ తిరుపతిరావు

వినుకొండలో విద్యాశాఖ ఆటల పోటీలు

వినుకొండ(నూజెండ్ల): జిల్లా విద్యాశాఖ, స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని లయోలా హైస్కూల్లో వినుకొండ నియోజకవర్గ ఆటల పోటీల ఎంపికలు శనివారం ఎంఈవో జఫ్రుల్లా ప్రారంభించారు. అండర్–14, అండర్ –17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, యోగా, టెన్నికాయిట్, ఖోఖో, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో నియోజకవర్గంలోని నూజెండ్ల, వినుకొండ, బొల్లాపల్లి, శావల్యాపురం, ఈపూరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో నియోజకవర్గ జట్ల ను ఎంపిక చేయడం జరిగిందని నియోజకవర్గ కోఆర్డినేటర్ కేవీపీ రమణబాబు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఫాదర్ రవి, నాగలక్ష్మి, ఎం.విజయభాస్కర్, వ్యాయాయ ఉపాధ్యాయులు ఆర్.రాధాకృష్ణమూర్తి, వైవీ చిరంజీవిరావు, ఎస్.రూత్‌కుమారి, వీరాంజనేయు లు, మనీ, వెంకటరత్నం, అంకారావు, బాబు, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, యేసురాజు, సుధారాణి, అనురాధలు తదితరులు పాల్గొన్నారు.



అల్లర్లకు పాల్పడితే చర్యలు

ఈపూరు: అల్లర్లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట డీఎస్పీ మహేష్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేసుల వివరాలపై స్థానిక ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడు తూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, తదితరులు ఉన్నారు.

వక్తృత్వ పోటీలకు ఆహ్వానం

చిలకలూరిపేట: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరి పేట ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల స్థాయి విద్యార్థులకు ఈ నెల 15న వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి ఎ.వేమనరెడ్డి తెలిపారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు తియ్యగూర కోటిరెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ పోటీలలో వ్యాసరచనకు సంబంధించి తెలుగుభాష– భవితవ్యం అనే అంశంపై ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. కళాశాలకు ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు.

పేకాట స్థావరంపై దాడి

–రూ.81,720 నగదు పట్టివేత

క్రోసూరు: క్రోసూరు ఎస్ఐ పాల్ రవీందర్ తన సిబ్బందితో కలిసి శనివారం వన్నాయపాలెం మధ్యలోని కొండ వద్ద పేకాట స్థావరంపై దాడి చేశారు.ఈ దాడిలో 13 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.81,720 నగదు స్వాధీనం చేసుకున్నారు.

జూదరుల అరెస్టు

పిడుగురాళ్ల: పదహారు మంది జూదరులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయలు శనివారం తెలిపారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని ఒక షాపులో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అందులో మొత్తం 16 మంది పేకరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ. 2.25 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయలు మాట్లాడుతూ జూదం ఆటలు ఎంతటివారైన ఆడినా, ఆడించినా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలి

అమరావతి: మహిళా సాధికారతే లక్ష్యంగా నిరంతరం కృషి చేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు వైఎస్సార్ క్రాంతి పథం అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 8 రకాల రుణాలను డ్వాక్రా మహిళలకు అందించి, ఆర్థికంగా వారి పురోభివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి చేయూత నందించాలన్నారు. మండలంలో మహిళలకు అందించిన రుణాలు రూ.1.20కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో డ్వాక్రా మహిళలు రుణ నగదు తిరిగి చెల్లించినప్పటికీ ఆ మొత్తాన్ని యానిమేటర్లు తమ సొంతానికి వాడుకున ఘటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. మహిళలను మోసగించి, వారి నగదు వాడుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇటీవల ధరణికోటలో డ్వాక్రా మహిళల సంతకాలు ఫోర్జరీ చేసి, బ్యాంకు మేనేజర్‌తో కుమ్మక్కై, రూ.2 లక్షలు కాజేసిన యానిమేటర్, బ్యాంకు మేనేజర్‌పై అమరావతి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పావులూరి ఉమాదేవి, ఎఫ్‌పీఓ సీసీ మాధవి, సీసీలు సదాశివరావు, కుమారి, బ్రహ్మం, స్త్రీనిధి మేనేజర్ సంతోష్, అకౌంటెంట్ శ్రావణి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

వివాద రహిత గ్రామంగా తురగావారిపాలెం

అమరావతి: ప్రతి సమస్యకు కేసులు పెట్టుకోవటమే పరిష్కార మార్గం కాదని, నేటి సమాజ పరిస్థితుల దృష్ట్యా రాజీపడటమే రాజమార్గంగా గుర్తించాలని సత్తెనపల్లి న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని మునగోడు శివారు తురగావారిపాలేన్ని సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో వివాద రహిత గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భాన్ని గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఇప్పటి వరకు గ్రామస్తులు తమ సమస్యలకు గ్రామ పెద్దలు చూపిన పరిష్కారాలను గౌరవించటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే పద్ధతిని అవలంభించి, మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఎటువంటి వివాదమైన పెద్దల సమక్షంలో చర్చించటం ద్వారానే పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలిసైదా, ప్యానల్ న్యాయవాదులు శ్రీనివాసరావు, వెంకటశివ, సీఐ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ బంకా విష్ణు, మునగోడు పీఏసీఎస్ అధ్యక్షుడు సింగం పుల్లారెడ్డితో పాటుగా పారాలీగల్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

లింగంగుంట్లలో పర్యటించిన పల్నాడు డీపీఎం కె.అమలకుమారి

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేసుకుంటే వర్షాభావ పరిస్థితుల్లో కూడా పొలాలు ఖాళీగా ఉంచకుండా పంటలు వేసుకుని ఆదాయం పొందవచ్చని పల్నాడు జిల్లా డీపీఎం కె.అమలకుమారి అన్నారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటలను ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం వల్లన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమానికి వ్యవసాయశాఖాధికారి ఇంజం శాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో బీడు భూముల్లో డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పని సరిగా ప్రకృతి వ్యవసాయం పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. గ్రామంలో బాలస్వామి సాగు చేస్తున్న సేంద్రియ పంటను పరిశీలించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అమలకుమారి

విద్యుత్తు విజిలెన్స్ తనిఖీలు

కారెంపూడి: మండలంలోని ఏడు గ్రామాలలో శనివారం విద్యుత్తు శాఖ విజిలెన్స్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. అక్రమంగా విద్యుత్తు వినియోగానికి పాల్పడుతున్న 108 మందిని గుర్తించి వారికి రూ.3.99 లక్షల అపరాధ రుసుమును విధించారు. డీపీఈ ఈఈ కె.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఈఈ జె.హరిబాబు పర్యవేక్షణలో 47 మంది అధికారులు, 141 మంది సిబ్బంది 47 బృందాలుగా ఏర్పడి కారెంపూడి, చింతపల్లి, ఒప్పిచర్ల, రెడ్డిపాలెం , చినగార్లపాడు, పేటసన్నెగండ్ల, పెదకొదమగుండ్ల గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 4,450 సర్వీసులను తనిఖీ చేశామని అనుమతి లేకుండా నేరుగా విద్యుత్తు వాడుకుంటున్న, అలాగే వివిధ మార్గాల ద్వారా అక్రమంగా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించామని అధికారులు తెలిపారు. విద్యుత్తు చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించినట్లయితే ఫోన్ 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు ఫోన్ చేసి కాని, వాట్సప్ ద్వారా కాని తెలపాలని డీపీఈ ఈఈ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీటర్‌కు సీలు వివిధ కారణాల వల్ల పోతే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు. తనిఖీలలో డీఈఈ ఎం.రవికుమార్, డీఈఈ కె.రవికుమార్, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ కె.కోటేశ్వరరావు, ఏఈ సీహెచ్ కోటేశ్వరరావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీల రిపోర్టులను తయారు చేస్తున్న విజిలెన్స్, విద్యుత్తు శాఖ అధికారులు

పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన

మాచవరం: పత్తి సాగు చేస్తున్న రైతులు సాగు విధానంలో దగ్గర అంతరం (90సెం.మీ. 30 సెం.మీ) పద్ధతి పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన్ కేంద్రం (ప్రకాశం జిల్లా) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో జాతీయ పత్తి పరిశోధనా సంస్థ (నాగపూర్) ఆధ్వర్యంలో పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన శనివారం నిర్వహించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు పత్తి సాగుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దగ్గర అంతర పత్తి సాగుపై రైతులకు అవగాహనా కల్పించారు. పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు చమత్కార్ మందు పిచికారీ చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ యనిషీబా, డాక్టర్ జాహ్నవి, టీవీ రెడ్డి, కె.భవ్యశ్రీ, నూజివీడు సీడ్స్ ఏజీఎం నరసింహారెడ్డి, ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ రామమ్మ, చంద్రిక, రవికిరణ్, బర్మానాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దిడుగులో 300 గ్రాముల గంజాయి పట్టివేత

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామంలో శనివారం పెదకూరపాడు ఎస్ఈబీ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ మల్లాది భుజంగరావు తన సిబ్బందితో దాడి నిర్వహించి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఎస్ఐ ఫణికుమార్ మాట్లాడుతూ అమరావతికి చెందిన షేక్ ఇబ్రహీం , బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలేనికి చెందిన కోజ్జా అంకమరావు ద్విచక్ర వాహనంపై 300గ్రాముల గంజాయి తరలిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు దిడుగు గ్రామం వద్ద వారిద్దరి, గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరివురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.